క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని గంజిపేటలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లను తొలగించనున్న సందర్భంగా సోమవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, కొత్త బస్టాండు, సుంకులమ్మ మెట్టు, రాజావీధి, శేరెల్లి వీధి, గాంధీచౌక్, పాత కూరగాయల మార్కెట్, రాంనగర్, బీసీ కాలనీ, వేదనగర్, మోమిన్ మహెల్లా, దౌదర్ పల్లి తదితర కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.
అలంపూర్: విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నట్లు అలంపూర్ చౌరస్తా విద్యుత్ సబ్ డివిజనల్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి సోమవారం అలంపూర్ చౌరస్తా పరిధిలోని 33కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరిచేయడం, మిడిల్ పోల్స్ ఎత్తే పనులు, విద్యుత్ లైన్‌లకు తాకే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో 33/11 కేవీ అలంపూర్ చౌరస్తా సబ్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

6న కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం

గట్టు: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 6న గద్వాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మారెన్న, కార్యదర్శి రాజులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో కేవీపీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కమిటీలో చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, దళిత బంధు, శ్మశాన వాటిక, ఇండ్ల స్థలాలు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి కర్రెప్ప పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు, పెండింగ్ చలాన్లు, హెల్మెట్ ధరించకపోవడం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ మద్యం తాగి వాహనాలు నడుపడం వల్లనే అన్నారు. పరిమితికి మించి అధిక లోడ్‌తో వాహనాలను తరలించరాదని తెలిపారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహన తనిఖీల్లో పోలీసులు ఉన్నారు.

సినీ హీరో సుమన్ సందడి



గద్వాల అర్బన్: టాలివుడ్ ప్రముఖ సినీ హీరో సుమన్ ఆదివారం గద్వాలలో సందడి చేశారు. ఓ షోరూం ప్రారంభోత్సవానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హీరో సుమన్‌ను చూసేందుకు అభిమాను లు తరలివచ్చారు. అదేవిధంగా జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లు షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయంలో ఇటీవల చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడి పనిష్మెంట్ కింద మరో ఆలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఆలయ ఉద్యోగికి షోకాజ్ నోటీస్ ఇమ్మని దేవదాయశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై ఇటీవల విచారణ చేసి రెండు ఇంక్రిమెంట్లు కట్‌చేస్తూ, అనంతరం షోకాజ్ నోటీస్ ఇవ్వమని దేవదాయశాఖ మూడు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత ఈఓ సదరు ఉద్యోగికి నేటి వరకు షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌ను వివరణ కోరగా తనకు ఇటీవల ఉత్తర్వులు అందాయని, మరో రెండు రోజుల్లో షోకాజ్ నోటీస్ జారీ చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మానవపాడు: కంటైనర్‌ను లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌కు గాయాలైన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఢిల్లీ నుంచి కోయంబత్తూర్ వెళ్తున్న కంటైనర్ పిల్లల ఆటబొమ్మల లోడ్‌తో వెళ్తోంది. ఉత్తరప్రదేశ్ నుంచి బెంగుళూరు వెళ్తున్న లారీ మానవపాడు మండలంలోని జల్లాపురం శివారులో కంటైనర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ ముబారక్‌కు గాయాలయ్యాయి.



అలంపూర్‌కోర్టులో జాతీయ పతకానికి వందనం చేస్తున్న జడ్జి కమలాపురం కవిత



గద్వాలలో జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



గద్వాలలో ఎంఏఎల్‌డీ డీగ్రీ కళాశాలలో..

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన పల్లెలు, పట్టణాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలపై రెపరెపలాడిన జాతీయ పతాకం
- అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళి
- వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతిధులు

గద్వాల: కోటి ఆశలు.. కొంగొత్త ఆశయాలు.. స్వ రాష్ట్రంలో సంబరాలు.. వెరసి జనం గుండె అంబరాన్ని తాకింది. ప్రతి ఒక్కరిలో ఉత్సాహం ఉరకలేసింది. స్వపరిపాలన సాధించి పదేళ్లు పూర్తయిన ఆనందం పెల్లుబికింది. పల్లె, పట్టణం తేడా లేకుండా ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించారు. జేఏసీ, విద్యార్థి, వివిధ సంఘాల నాయకులు సైతం వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అసువులు బాసిన అమరుల ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సూచించారు. డీకే బంగ్లాలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

'అమరుల త్యాగఫలమే తెలంగాణ'

గద్వాల అర్బన్: తెలంగాణ అమరవీరుల త్యాగ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని జడ్పీచైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్మృతివనం ఉన్న అమరవీరుల స్థూపం దగ్గర జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కౌన్సిలర్లు నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు మధుసూదన్ బాబు, ఇసాక్, నాగేందర్ యాదవ్, వెంకట్రామిరెడ్డి, డీటీడీసీ నర్సింహ తదితరులు ఉన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయం వద్ద అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీజేఎస్ జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, టీపీఎఫ్ ప్రభాకర్, రైతు సంఘం, ఉద్యమ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అరమవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. బహుజన సంఘాలు, కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామికవాదులు జిల్లా కేంద్రంలోని స్మృతివనంలోని అమరవీరుల స్థూపానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నడిగడ్డహక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ జిల్లా కేంద్రంలో వారి కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొండలక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఎన్నో విగ్రహాలకు విద్యుత్ కాంతులతో అలంకరించి, కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని విస్మరించారని, దీనిని నిరసిస్తూ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఆవరణంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి కమలాపురం కవిత, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బేగం, ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సీఐ హనుమ నాయక్, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ అనిత, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నాగరాజు, గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్, లైబ్రరీలో లైబ్రేరియన్ మాణిక్యమ్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితారాణి, పోలీస్‌స్టేషన్ దగ్గర ఎస్ఐ రామకృష్ణ, సహకార సంఘం దగ్గర అధ్యక్షుడు క్యామ వెంకటేష్, పంచాయతీ దగ్గర కార్యదర్శి శివకుమార్, బల్గెరలో జడ్పీటీసీ బాసు శ్యామల, బోయలగూడెంలో వైస్ ఎంపీపీ సుమతిలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీపీ పద్మావతి, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ సురేఖ, రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం సభ్యులు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బీసమ్మ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సలీముద్దీన్, జడ్పీహెచ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హేమలత, కలుగోట్ల పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ గజేందర్ రెడ్డి, జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దేశ నాయకుల ఫొటోలకు పూలమాలలు వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయభాస్కర్, మున్సిపల్ ఆఫీస్‌లో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రహ్లాద రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి త్రివర్ణ జెండాను ఆవిష్కరించారు. అధికారులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాల ముందు ఆ పార్టీ నాయకులు జాతీ య జెండాలు ఎగురవేశారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, నాయకులు ఎల్లన్న ముస్తఫా, మనోహర్, నాగన్న ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ స్నేహ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్, పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జాతీయ జెండాను ఎగుర వేశారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ శాఖల్లో రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు.

రాజోళి: తహసీల్దార్ కార్యాలయంలో హరికృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సికిందర్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, జడ్పీటీసీ సుగుణమ్మ, ఎంపీఓ ఖాజా, ఎస్ఐ జగదీశ్వర్, గోపాల్, గంగిరెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజల ఆకాంక్షకు నిదర్శనం తెలంగాణ



చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రజల ఆకాంక్షకు నిదర్శనమే తెలంగాణ రాష్ట్ర సాధన అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కొత్తగా ఆవిర్భవించిన రాష్ట్రాన్ని కేసీఆర్ తన పాలనతో దేశంలోనే తెలంగాణను దిక్సూచిగా నిలిపారన్నారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, కిషోర్, శ్రీధర్ రెడ్డి, మద్దిలేటి, రఘురెడ్డి, సత్యనారయణ ఉన్నారు.



మానవపాడులో..



ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో..



అలంపూర్‌లో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



అలంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో..



బీజేపీ ఆధ్వర్యంలో..



ఇటిక్యాలలో..



వడ్డేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..



గట్టులో జెండావిష్కరణ చేస్తున్న తహసీల్దార్



అయిజలో త్రివర్ణ జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ జ్యోతి

అమరులకు కొవ్వొత్తులతో నివాళి



అయిజలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

అయిజ: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం అఖిలపక్ష కమిటీ నాయకులు తెలంగాణ అమర వీరులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి,మలి దశలలో పోరాటం చేసి అనేకమంది అమరులయ్యారన్నారు. వారి త్యాగాల వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



గెలుపు చిహ్నం చూపుతున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఫలితాల సందర్భంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిపై 111 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎర్రవల్లి కూడలిలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమేశ్వ రెడ్డి, రాఘన్న, కృష్ణసాగర్, రాముడు, వినోద్, లక్ష్మన్, జమ్మన్న ఉన్నారు.

అమరవీరులను మరిచారు



అలంకరణకు నోచుకోని శాంతినగర్‌లోని అమరవీరుల స్థూపం

శాంతినగర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు కోల్పోయిన అమర వీరులను అందరు మరిచారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంతట ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారని, రాష్ట్రం ఏర్పడటానికి అమరులైన ఎంతోమంది జ్ఞాప కార్థం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి కనీసం అలంకరణ చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. అమరవీరులను స్మరించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికారులేగాక ఆయా పార్టీల నాయకులు అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పించకపోవడం చాలా దారుణమన్నారు. నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లను వెంటనే కలెక్టర్ సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాలల వద్ద పారిశుద్ధ్యమేదీ?

- త్వరలో తెరుచుకోనున్న పాఠశాలలు
- పాఠశాలల వద్ద వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బందులు పడనున్న విద్యార్థులు



అయిజలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలముందు నిలిచిన మురుగు

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ముందు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మురుగు నిలవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే చిన్నారులు మురుగులో నడువలేక అసహనానికి గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు ప్రభుత్వ పాఠశాలల ముందు మురుగు నిలవడంతో ఆ ప్రదేశంలో దుర్వాసన వెదజల్లుతోంది. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్నాయి. అంతలోపే ప్రభుత్వ పాఠశాలల ముందు ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చివేసి సీసీబెడ్ వేయాలి. అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులేవి?

అయిజ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 55 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 29 ప్రాథమిక, 16 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలున్నాయి. ఉర్దూ మీడియం పాఠశాల ఉంది. 6 నుంచి ఇంటర్ వరకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది. వీటిలో అనేక పాఠశాలలకు మౌలిక వసతులు లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మురుగు సమస్య ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, ఉపాధ్యాయులను పట్టి పీడిస్తోంది.

మురుగు నిలిచే పాఠశాలలు..

మున్సిపాలిటీలోని బాలికల ప్రాథమిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల మురుగు మధ్య ఉంటున్నాయి. వర్షం పడిన ప్రతిసారి పాఠశాలల చుట్టూ మురుగు నిలుస్తోంది. మండలంలోని ఈడుగోనిపల్లి, కుటుకనూరు, సింధనూరు, తొత్తినోనిదొడ్డి, బింగుదొడ్డి, వేణిసోంపురం పాఠశాల ముందు వర్షంనీరు నిలిచి మురుగు ఏర్పడుతోంది. పాఠశాలల పరిసర పల్లపు ప్రదేశాలను మట్టితో నింపాలని, సీసీ బెడ్ వేయాలని సంవత్సరాల తరబడి చెబుతున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. పాఠశాలల ముందు మురుగు నిలుస్తుందని, వి ద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలకు గురవుతున్నారని విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిపాము. ఇప్పటికే కొన్ని పాఠశాలల ముందు గుంతలను పూడ్చి పారిశుద్ధ్యం పనులు చేపట్టారు.

– నరసిరసింహ, ఇన్‌చార్జి ఎంఈఓ

మురుగు తొలగించాలి..



ప్రభుత్వ పాఠశాలల వద్ద మురుగు ఏర్పడుతోంది. మురుగు వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. మురుగులో నడిచి పాఠశాలలోకి ప్రవేశిస్తే పాఠశాల గదుల్లో బురద అంటుతోంది. పాఠశాలల్లో బెంచీలు లేవు. కింద కూర్చున్నప్పుడు దుస్తులకు బురద అంటుతోంది. దాని వల్ల విద్యార్థులం చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి పాఠశాలల వద్ద మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– రవీంద్ర, ఉపాధ్యాయుడు, తుపత్రాల

పారిశుద్ధ్య పనులు చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మురుగు వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలల ముందు మురుగు నిల్వకుండా మట్టితో ఎత్తు పెంచాలి. దానిపైన సీసీ బెడ్డు ఏర్పాటు చేయాలి. పాఠశాల చుట్టుపక్కల ప్రదేశాల్లో మురుగు నిలువకుండా చర్యలు చేపట్టాలి. పాఠశాల పరిసరాలు బాగుంటేనే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేందుకు ఇష్టపడుతారు.

– జగన్నాథ రెడ్డి, అయిజ

వ్యాధులు వ్యాపిస్తాయి



పాఠశాలల ముందు మురుగు వల్ల దోమల ఉధృతి పెరిగి విద్యార్థులకు వ్యాధులు వ్యాపిస్తాయి. చిన్నారులకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. ముందుగా మురుగు, బురద ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. పాఠశాలల చుట్టూ గులుకరాళ్ల మట్టిని నింపాలి. అవసరమైన ప్రదేశాల్లో సీసీ బెడ్ ఏర్పాటు చేయాలి.

– సంతోష్, 10వ తరగతి, చిన్న తాండ్రపాడు